క్లుప్తంగా

చీరల పంపిణీ



కేజియా ఫౌండేషన్ సభ్యులు ఇచ్చిన చీరలు తీసుకున్న వితంతువులు

శృంగవరపుకోట: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు తమ ఉదారతను చాటుకున్నారు. రేగపుణ్యగిరికి చెందిన కేజియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు జోసెఫ్ ప్రసాదరావు నేతృత్వంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు శెట్టి రాజకుమార్, దుర్యా శ్రీనివాసరావు, కిల్లో వెంకటనారాయణ తదితరులు కలిసి స్థానిక పందిరప్పన్న జంక్షన్‌లో 20 మంది పేద వితంతువులకు శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఈశ్వరరావు

వేపాడ: మండల కేంద్రంలోని విక్టరీ హైస్కూల్‌లో శుక్రవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న 200 మంది విద్యార్థులకు కంటి వైద్యుడు సీహెచ్ ఈశ్వరరావు కంటి పరీక్షలు చేశారు. పలువురు విద్యార్థులకు కళ్లద్దాలు అవసరమని గుర్తించి అందుకోసం సిఫార్సు చేసినట్లు సీహెచ్ఓ ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

కొత్తవలస: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు అతలాకుతలమైన ప్రాంతాల్లో సర్వం కోల్పోయిన బాధితులకు సహాయం చేసేందుకు సీపీఐ నాయకులు శుక్రవారం విరాళాలు సేకరించారు. పట్టణంలోని ప్రతీ షాపు వద్దకు వెళ్లి వరద బాధితులకు తమ వంతు సాయం అందించాలని వ్యాపారులను కోరారు. పలువురు దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేశారు. సేకరించిన మొత్తాన్ని వరద బాధితులకు అందజేయనున్నట్లు సీపీఎం నాయకుడు డేగల అప్పాలరాజు తెలిపారు.

ఘనంగా ఎల్ఐసీ వార్షికోత్సవం



ఏపీపీ కేశవరావును సన్మానిస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

శృంగవరపుకోట: స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో ఆ సంస్థ 68వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.కేశవరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల జీవితాల్లో భాగం అయిన ఎల్ఐసీ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సీనియర్ బ్రాంచ్ మేనేజర్ రాజు 1956లో ఎల్ఐసీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు ఆ సంస్థ సాధించిన పురోగతిని వివరించారు. అనంతరం ఏపీపీ కేశవరావును ఎల్ఐసీ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. వారం రోజులుగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఓలు, ఏజెంట్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న డీపీఓ శ్రీధర్‌రాజా

దత్తిరాజేరు: పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించే గ్రామ కార్యదర్శులపై చర్యలు తప్పవని డీపీఓ శ్రీధర్‌రాజా అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని వీధికాలువల్లో మురుగునీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు పూడికలు తొలగించి, బ్లీచింగ్ చల్లించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని, మరుగుదొడ్లు లేనివారిని గుర్తించి మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టేలా చూడాలని, బహిరంగ మలవిసర్జన రహితంగా గ్రామాలను తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్డీ వాణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం..
కాలుష్యాన్ని నివారిద్దాం..



గజపతినగరం: మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి పడాల అరుణ, తదితరులు



చీపురుపల్లి: మట్టి వినాయక ప్రతిమలు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ శిరీష, తదితరులు

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతి ప్రతిమలనే పూజించాలని పలు స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు పిలుపునిచ్చారు. మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీఓపీ)తో తయారు చేసిన విగ్రహాలతో పర్యావరణానికి ఏవిధంగా హాని కలుగుతుందో ప్రజలకు అవగాహన కల్పించారు. సింథటిక్ రంగులు, పీఓపీతో తయారు చేసిన విగ్రహాల కారణంగా



శృంగవరపుకోట: ఎస్.కోట ఆర్టీసీ డిపోలో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న జియో రామకృష్ణ

జలవనరులు కలుషితమవుతున్నాయని, జీవరాశులకు నష్టం వాటిల్లుతోందని అన్నారు. అందుకనే ప్రతి ఒక్కరూ మట్టి గణపతి ప్రతిమలను పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగ



గుర్ల: మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బెల్లాన జగన్నాథం

స్వాములు కావాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



కొత్తవలస: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు



లక్కవరపుకోట: కొట్యాడలో మట్టి వినాయక ప్రతిమల ఆవశ్యకతను వివరిస్తున్న జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు



వేపాడ: మట్టితో చేసిన గణపతి ప్రతిమలను చూపిస్తున్న బొద్దాం హైస్కూల్ విద్యార్థులు

వరద నీటిలో ఆర్టీసీ కాంప్లెక్స్

కొత్తవలస: కొత్తవలస ఆర్టీసీ కాంప్లెక్స్‌ను వరద నీరు చుట్టుముట్టింది. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణంలో నీరు చేరడంతో ప్రయాణికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో ఆక్రమణలు పెరిగిపోవడంతో వర్షం నీరు వెళ్లేందుకు మార్గం లేక నిలిచిపోయింది. ముఖ్యంగా కాంప్లెక్స్ ప్రవేశ ద్వారం వద్ద మోకాలి లోతు వరకు నీరు చేరడంతో ప్రయాణికులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. కాంప్లెక్స్ ఆవరణలో పార్కింగ్ చేసిన ద్విచక్రవాహన వాహనాలు నీటలో మునిగి



కొత్తవలస ఆర్టీసీ కాంప్లెక్స్‌ను చుట్టుముట్టిన వరదనీరు

పాడైపోతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వర్షం నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎస్సై బదిలీ

మెరకముడిదాం: బుధరాయవలస ఎస్సైగా పనిచేస్తున్న బి.లోకేశ్వరరావు గరివిడి పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పోలీసుశాఖ ఉన్నతాధికారులు ఇంకా ఎవరినీ నియమించలేదు. కొత్త ఎస్సై వచ్చేంతవరకు గరివిడి ఎస్సైగా వెళ్లిన లోకేశ్వరరావుకే అదనపు బాధ్యతలు అప్పగించారు.

బొత్సకు ఘన స్వాగతం



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి రూరల్(గరివిడి): వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, శాసన మండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు చీపురుపల్లి నియోజకవర్గ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన తరువాత శుక్రవారం తొలిసారిగా గరివిడి క్యాంపు కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి పుష్పగుచ్ఛాలు అందజేశారు. నాయకులతో కాసేపు ముచ్చటించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పరిస్థితులపై ఆరా తీశారు. నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎస్వీ రమణరాజు, కేవీ సూర్యనారాయణరాజు, గరివిడి, గుర్ల జెడ్పీటీసీలు వాకాడ శ్రీనివాసరావు, సీర అప్పనాయుడు, గరివిడి మండల నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు కొణిశ కృష్ణంనాయుడు, చీపురుపల్లి మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, గుర్ల మండల నాయకులు పోట్నూరు సన్యాసినాయుడు, తోట తిరుపతిరావు, మెరకముడిదాం మండల నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షుడు పాల్గొన్నారు.

నిరుపయోగ స్థలంలో ఉపాధి పనులు



ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ఉన్న స్థలంలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న ఉపాధిహామీ వేతనదారులు

గజపతినగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిరుపయోగంగా ఉన్న స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలను శుక్రవారం ఉపాధి కూలీలతో తొలగించారు. అయితే దీనిపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు ఉపయోగపడే సాగునీటి కాలువలు, చెరువులు, ఫారం పాండ్స్ నిర్మాణం, తదితర పనులు చేయిస్తే బాగుంటుందని, కానీ ఇలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పేరుకుపోయిన పిచ్చిమొక్కలను తొలగించడం సరికాదని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధి వేతనదారులతో ప్రజలకు ఉపయోగపడే పనులు చేయించాలని కోరుతున్నారు. దీనిపై అక్కడ ఉన్న మేట్‌ను సంప్రదించగా.. ముందుగా వేతనదారులతో వేరే చోట పని చేయించామని, అక్కడ పని పూర్తవడంతో ఇక్కడ పని చేయించినట్లు చెప్పారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



గజపతినగరం: కొత్తబగ్గాం అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీఓ నాగమణి



వేపాడ: అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు పౌష్టికాహారం అందించిన కార్యకర్తలు



గంట్యాడ: గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న సీడీపీఓ ఉమాభారతి



దత్తిరాజేరు: పోరలి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాల్లో పాల్గొన్న గర్భిణులు, బాలింతలు

మాతాశిశు ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గజపతినగరం, గంట్యాడ, దత్తిరాజేరు, వేపాడ మండలాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ సిబ్బంది వివరించారు. అప్పుడే పుట్టిన శిశువుకు తల్లిపాలు అందించాలని, తల్లిపాలతో శిశువులో రోగనిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. అనంతరం పౌష్టికాహార ప్రదర్శన, గర్భిణులకు సామూహిక సీమంతాలు, అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్

చవితి సందడి

కొత్తవలస: మండల కేంద్రం కొత్తవలస జంక్షన్‌లో వినాయ చవితి సందడి నెలకొంది. గణపతి పూజకు కావాల్సిన సామగ్రి కొనుగోలు చేసేందుకు శుక్రవారం పరిసరా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున మార్కెట్‌కు తరలివచ్చారు. పండ్లు, పత్రి, గణపతి ప్రతిమలు, పూజా సామగ్రి విక్రయ దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడుతూ కనిపించాయి.



పండ్లు దుకాణం వద్ద కొనుగోలుదారులు

గణేశ్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

చీపురుపల్లి: వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై ఎల్.దామోదర్ అన్నారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ వకుల్ జిందాలు ఆదేశాల మేరకు వినాయక చవితి ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. చవితి వేడుకల్లో ఎలాంటి వివాదాలు, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఉత్సవ కమిటీలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వివాదస్పద స్థలాల్లో విగ్రహాలు పెట్టరాదని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఉత్సవాలు పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండపం వద్ద, వినాయక ఊరేగింపులో ఎలాంటి డీజేలు వినియోగించరాదని స్పష్టం చేశారు. నిమజ్జనం రోజున వినియోగించే వాహనాలకు ముందుస్తు అనుమతి తీసుకోవాలని, చీకటి పడకముందే నిమజ్జనం పూర్తిచేయాలని సూచించారు.

● దత్తిరాజేరు: వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరిగా పొందాలని పెదమానాపురం, ఎస్.భూర్జవలస ఎస్సైలు జయంతి, రాజేష్ శుక్రవారం తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు నిబంధనల మేరకు నడుచుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం



ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో ఉన్న శ్రీహరి హరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి మేజర్ పంచాయతీ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ నాసక రామ్మోహనరావు, లీలావతి దంపతులు రూ.51,116 ఆర్థిక సహకారం అందజేశారు. శుక్రవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, ఎస్వీజీ శ్రీనివాసరావు, గంట్యాడ విష్ణుమూర్తి, దిలీప్‌కుమార్ ధనూకా, ఈశ్వరరావు తదితరులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతలు సహకారంతో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీలను వినియోగంలోకి తీసుకురావాలి



కార్యదర్శులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ కిశోర్‌కుమార్

గజపతినగరం: మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉన్న చెత్త సంపద కేంద్రాలు(ఎస్‌డబ్ల్యూపీసీ)ను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీఓ కె.కిశోర్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రతిరోజు తడి, పొడిచెత్త సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలించేలా కార్యదర్శులు పర్యవేక్షించాలన్నారు. తరలించిన చెత్తను వర్మీకంపోస్టుగా మార్చి రైతులకు తక్కువ ధరకు అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లోని మురుగుకాలువల్లో ఎప్పటికప్పుడు పూడికలు తొలగించి బ్లీచింగ్ చల్లాలని, మురుగునీరు నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ పప్పు సుదర్శనం పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



జోగారావు మాస్టారును సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు



ప్రిన్సిపాల్ పి.శాంతిని సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు



చీపురుపల్లి రూరల్: రాజు మాస్టారును సన్మానిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

శృంగవరపుకోట: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్న కె.వి.జోగారావు మాస్టారును రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు శుక్రవారం సన్మానించారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జోగారావు ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ఆయన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సబ్ డిస్ట్రిక్ బ్రాంచ్ ఎంసీ మెంబర్ కావడంతో రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు డాక్టర్ పి.వరలక్ష్మి, డి.సూర్యారావు, ఎ.మల్లేశ్వరరావు, శ్రీనాథు వెంకన్నబాబు, జి.ధనుంజయ్, హెచ్ఎం గణపతిరావు ఘనంగా సన్మానించారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేట వద్ద ఉన్న ఆర్‌సీఎం స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ పి.శాంతి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికవడంతో చైతన్య భారతి రోటరీక్లబ్ సభ్యులు శుక్రవారం ఆమెను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక బెల్లాన కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ప్రశంసాపత్రం, మెమెంటో అందించి సత్కరించారు. పాఠశాల ఉపాధ్యాయులు పవన్, నారాయణరావు, కిరణ్, పుష్పలత, వికాష్, తదితరులు ఆమెకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు.

● చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని శివరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడు ఎం.రాజు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికవడంతో పాఠశాల హెచ్ఎం మీసాల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది శుక్రవారం ఆయన్ను ఘనంగా సన్మానించారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రచారం



ఎస్.కోటలో ప్రచారం చేస్తున్న డాక్టర్ శిరీష, తదితరులు

శృంగవరపుకోట: వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించాలని, రోగాల నియంత్రణకు సహకరించాలని కొట్టాం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎస్.కోట పట్టణంలోని పెద్దవీధిలో శుక్రవారం ఇంటింటా ప్రచారం చేశారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వలు లేకుండా చూడాలని, పాడైన పాత్రలు, మట్టికుండీలు, టైర్లు, వంటి వాటిలో నీరు చేరి నిల్వ ఉండడం వల్ల దోమలు గుడ్లు పెట్టి వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. దోమల వల్ల మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, నీటి ట్యాంకులను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లుకోవాలని సూచించారు. కొట్టాం వైద్యాధికారి హారిక, ఎస్‌యూఓ బి.శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ శంకర్, రామకృష్ణ, ఏఎన్ఎం, ఎంటీఎస్ రాజశేఖర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.